sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే

హైదరాబాద్ | 31-08-2026 సోమవారం | సంపుటి-02 సంచిక : 141 EDITOR: ROHINI



నీట్ పరీక్షలో పది సార్లు పవర్ కట్

కనీసం జనరేటర్ సదుపాయం లేని దుస్థితి

- జైపూర్ పరీక్షా కేంద్రం నిర్లక్ష్యానికి పరాకాష్ట
- పదిసార్లు రీ లాగిన్ అయిన వైద్య విద్యార్థులు
- పరీక్ష రద్దు చేస్తూ కేంద్రం సంచలన నిర్ణయం
- ఎఫెక్ట్ అయిన విద్యార్థులకు 5న మళ్లీ పరీక్ష
- విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారా?

దేశంలోని ప్రతిష్టాత్మకమైన మెడికల్ ఎంట్రన్స్ పరీక్షలో తీవ్ర గందరగోళం చెలరేగింది. జైపూర్ కేంద్రంలో పదేపదే పవర్ కట్ కావడంతో కంప్యూటర్ సిస్టమ్స్ హ్యాంగ్ అయ్యాయి. లక్షలాది మంది భవిష్యత్తు అగమ్యగోచరంగా మారడంతో అభ్యర్థులు రోడ్డెక్కి నిరసనలు తెలిపారు. ఎన్టీఈఎంఎస్ వైఫల్యంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- సహనం వందే, రాజస్థాన్

నీట్ యూజీ పరీక్ష పేపర్ లీక్ వ్యవహారం దేశాన్ని కుదిపేసిన సంఘటన మరువకముందే... ఇప్పుడు నీట్ పీజీ పరీక్ష గందరగోళం నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోంది. దేశవ్యాప్తంగా నీట్-పీజీ-2026 పరీక్ష ఆదివారం అనేక ప్రాంతాల్లో ప్రారంభమైంది. కానీ రాజస్థాన్‌లోని జైపూర్ నగరంలో ఒక పరీక్షా కేంద్రంలో మాత్రం పరిస్థితి పూర్తిగా అన్ కంట్రోల్ అయిపోయింది. పరీక్ష రాద్దామని సెంటర్‌కు వెళ్లిన అభ్యర్థులకు అక్కడ ఎదురైన అనుభవం పీడకలలా మారింది. పరీక్ష మొదలైన క్షణం నుంచే సాంకేతిక లోపాలు అభ్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేయడం మొదలుపెట్టాయి.

విద్యుత్ సరఫరాలో అంతరాయాలు...

పరీక్ష జరుగుతున్న సమయంలోనే ఆ కేంద్రంలో విద్యుత్ సరఫరా అనేకసార్లు నిలిచిపోయింది. ఒకసారి పోయి వస్తే ఏదో అనుకోవచ్చు. కానీ ప్రతీ 10-15 నిమిషాలకు ఒకసారి కరెంటు పోతూనే ఉంది. దీంతో కంప్యూటర్ సిస్టమ్స్ అన్నీ ఒక్కసారిగా షట్ డౌన్ అయిపోవడం విద్యార్థులను టెన్షన్ కు గురిచేసింది. ప్రశ్నలు చదువుకుంటున్న సమయంలో సిస్టమ్ హ్యాంగ్ అవ్వడం లాంటి సమస్యలు రిపీట్ అయ్యాయి.

పదేపదే రీ-లాగిన్ సమస్యలు...

పరీక్షా కేంద్రంలో ఉన్న సిబ్బందిని సాయం కోరితే వారి నుంచి సరైన స్పందన లభించ లేదని విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరించాల్సిన నిపుణులు అక్కడ చేష్టలు డిగి చూస్తూ ఉండిపోయారట. ఒకే పరీక్షను దాదాపు 10సార్లు రీ-లాగిన్ చేయాల్సి వచ్చిందని, దీనివల్ల తమ అమూల్యమైన సమయం అంతా వృథా అయిపోయిందని అభ్యర్థులు వాపోయారు. సిస్టమ్స్ లాగిన్ అవ్వడానికి పడిన పాట్లు అన్నీ ఇన్నీ కావు. ప్రతిసారీ ఐడీ పాస్‌వర్డ్ కొట్టి లాగిన్ అయ్యే సరికి పదే పదే సర్వర్ ఎర్రర్లు రావడం ప్రారంభమయ్యాయి.

పరీక్షా కేంద్రం వద్ద నిరసనలు...

ఇంత పెద్ద జాతీయ స్థాయి పరీక్షకు కనీసం జనరేటర్ సౌకర్యాలు కూడా లేకపోవడం చూస్తుంటే వ్యవస్థ ఎంత దారుణంగా విఫలమైందో అర్థమవుతుంది. గంటల తరబడి ఈ హైడ్రామా కొనసాగడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సహనం కోల్పోయారు. పరీక్ష హాల్ నుంచి బయటకు వచ్చి సెంటర్ గేట్ల ఎదుట బైఠాయించి పెద్దఎత్తున నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది.

విద్యార్థుల ఆవేదన...

విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న ఇలాంటి నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. తమ భవిష్యత్తును అగమ్యగోచరం చేస్తున్న అధికారుల తీరుపై సోషల్ మీడియా వేదికగా కూడా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. లక్షల రూపాయలు ఫీజులు కట్టి, ఏళ్ల తరబడి కష్టపడితే చివరికి ఇలాంటి గందరగోళమే మిగులుతుందా అంటూ విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. దీంతో ఆ కేంద్రంలో పరీక్ష రాసిన వారందరికీ మళ్లీ ఎగ్జామ్ నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు.

సెప్టెంబర్ 5న రీ-ఎగ్జామ్...

ఎఫెక్ట్ అయిన అభ్యర్థులందరికీ షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 5వ తేదీన రీ-ఎగ్జామ్ ఉంటుందని మెడికల్ పరీక్షల బోర్డు స్పష్టం చేసింది. అయితే మళ్లీ చదువుకుని పరీక్ష రాయడం అనేది విద్యార్థులకు అదనపు భారంగా మారుతోంది. ఈ లోపాలకు బాధ్యులైన వారిపై ఇప్పటికైనా ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకుంటుందో లేదో వేచి చూడాలి. ఇలాంటి సాంకేతిక లోపాలు, నిర్లక్ష్యం వల్ల యువత ప్రతిభ అణగారిపోతోంది. డిజిటల్ ఇండియా అని గొప్పలు చెప్పుకుంటున్న కాలంలో కనీసం కరెంట్ సరఫరాను కూడా మేనేజ్ చేయలేకపోవడం మన వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపుతోంది.

జానపదాల జ్వాలలో ఏశనాగుల సాంగ్

ది ప్యారడైజ్ సినిమా పాటకు 3 కోట్ల వ్యూస్

- మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ బీట్స్ గూస్‌బంప్స్
- దేశవ్యాప్తంగా మొదటి స్థానంలో రికార్డ్ ట్రెండ్
- పిచ్చెక్కిస్తున్న నాని, కీర్తి సురేష్ డ్యాన్సు

న్యాచురల్ స్టార్ నాని, టాలెంటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఒదెల కాంబినేషన్‌లో వస్తున్న 'ది ప్యారడైజ్' సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలోని ఏశనాగుల పాట విడుదలైన కొన్ని గంటల్లోనే యూట్యూబ్‌లో ఇండియా వైడ్‌గా నంబర్ వన్ స్థానంలో ట్రెండ్ అవుతూ సంచలనాలు సృష్టిస్తోంది.

- సహనం వందే, హైదరాబాద్



టాలీవుడ్ మోస్ట్ ఎవైటెడ్ ప్యాన్ ఇండియా మూవీస్‌లో ది ప్యారడైజ్ సినిమా ముందు వరుసలో నిలబడుతుంది. న్యాచురల్ స్టార్ నాని హీరోగా, డైరెక్టర్ శ్రీకాంత్ ఒదెల దర్శకత్వంలో ఈ సినిమా అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోంది. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన దసరా సినిమా బాక్సాఫీస్ వద్ద సృష్టించిన సంచలనాలు అందరికీ గుర్తుండే ఉంటాయి. ఆ సినిమా ఇచ్చిన బిగ్గెస్ట్ సక్సెస్ జోష్‌తోనే ఇప్పుడు ఈ కొత్త ప్రాజెక్ట్ మీద అంచనాలు తారాస్థాయికి చేరిపోయాయి.

3 కోట్ల వ్యూస్‌ను దాటేసిన ఏశనాగుల సాంగ్

ఈ క్రమంలోనే రీసెంట్‌గా మేకర్స్ రిలీజ్ చేసిన ఏశనాగుల పాట సోషల్ మీడియాలో అసలు సిసలైన మాస్ జాతరను తలపిస్తోంది. సాంగ్ రిలీజ్ అయిన కొన్ని గంటల్లోనే యూట్యూబ్‌లో ఇండియా వైడ్ నంబర్ వన్ ట్రెండింగ్‌లోకి దూసుకెళ్లింది. అంతేకాకుండా ఏకంగా 3 కోట్ల వ్యూస్‌ను దాటేసి దూసుకుపోతుండడంతో నాని అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. పాటకు వస్తున్న ఈ అద్భుతమైన స్పందన చూస్తుంటే సినిమా విడుదలకు ముందే బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సునామీ సృష్టించబోతుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

అనిరుధ్ మ్యూజిక్ మ్యాజిక్

ఈ వైబ్రెంట్ సాంగ్‌కు టాలెంటెడ్ రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ తన సంగీతంతో ప్రాణం పోశారు. ఏశనాగుల పాటకు అనిరుధ్ అందించిన పవర్‌ఫుల్ మాస్ బీట్స్ ఈ సాంగ్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయని చెప్పాలి. తెలంగాణ జానపద సంగీతంలోని అసలైన మట్టి వాసనలను తీసుకుని, దానికి తనదైన స్టైల్ మోడ్రన్ మ్యూజిక్ టచ్‌ను జోడించి అనిరుధ్ ఈ పాటను కంపోజ్ చేశారు. దీనివల్ల పల్లెటూరి నేటివిటీ ఏమాత్రం మిస్ కాకుండానే నూటికి నూరు శాతం మాస్ ఎనర్జీ ఈ పాటలో ఉరకలేస్తుందని చెప్పవచ్చు.

కాసర్ల శ్యామ్ సాహిత్యం... గాయకుల జోరు

ఇక ఈ పాటకు ప్రముఖ లిరిసిస్ట్ కాసర్ల శ్యామ్ అందించిన సాహిత్యం మరో పెద్ద ఎస్సెట్ అని చెప్పాలి. పల్లెటూరి వాతావరణాన్ని, అక్కడి సంస్కృతిని కళ్లకు కట్టేలా ఆయన రాసిన పదాలు పాటకు అదనపు బలాన్ని చేకూర్చాయి. కేవలం క్యాచీ పదాలు వాడడమే కాకుండా నేటివిటీకి తగ్గట్టుగా సాగే లిరిక్స్ ప్రేక్షకులను ఇట్టే కట్టిపడేస్తాయి. ఈ పాట ఇంతలా సక్సెస్ కావడంలో గాయకుల పాత్ర కూడా చాలా కీలకమైందని చెప్పాలి. ప్రభా బంగారిగళ్ల, అద్దుల జంగిరెడ్డి తమకంటూ ప్రత్యేకమైన గాత్రంతో ఈ పాటకు మరింత జోష్ తీసుకొచ్చారు. వీరిద్దరి వాయిస్‌లో ఉన్న రా అండ్ రస్టిక్ నేచర్ అనిరుధ్ అందించిన మాస్ బీట్స్‌తో కలిసి ఏశనాగుల పాటను ఒక రేంజ్‌లో నిలబెట్టాయి. ఈ పాటకు నాని, కీర్తి సురేష్ వేసిన డాన్స్ ఉర్రూతలు ఊగిస్తుంది.

మగాడి కంప్పు... మగువకు ఇంప్పు

అబ్బాయిల చెమటకు అమ్మాయిల ఫిదా

- చెమట గబ్బులో చిగురుస్తున్న టీనేజ్ ప్రేమలు
- మురికి సంస్కృతికి అలవాటుపడ్డ నేటితరం
- స్నానం చేయట్లే... ముఖం కడగట్లే... హవ్వా!
- మూత్రం తాగే వెర్రి వెంగళప్పలు ఎందరో



స్నానం చేయకుండా, ఒళ్లంతా చెమట కంపు కొడుతుంటేనే అమ్మాయిలు ఫిదా అవుతారనే సరికొత్త పిచ్చి నేటి సోషల్ మీడియాలో కుర్రకారును ముంచెత్తుతోంది. వ్యక్తిగత పరిశుభ్రతను పూర్తిగా గాలికి వదిలేసి, సహజ వాసనల పేరుతో వికృత ప్రయోగాలు చేస్తున్న ఈ అనాగరిక పోకడలు ఇప్పుడు యావత్ సమాజాన్ని విస్మయానికి గురిచేస్తున్నాయి. నేటి తరం యువత వికృత పోకడల బండారం ఇది.

- సహనం వందే, హైదరాబాద్

టిక్‌టాక్ పుణ్యమా అని ఇప్పుడు నెట్టింట ఫెరోమోన్ మాక్సింగ్ అనే ఒక అసహ్యకరమైన ట్రెండ్ తెగ వైరల్ అవుతోంది. అందంగా కనిపించడం కోసం లుక్స్ మాక్సింగ్ చేసే కుర్రకారు, ఇప్పుడు ఏకంగా తమ శరీర మురికి వాసనతోనే అమ్మాయిలను పడేయొచ్చని నమ్ముతున్నారు. స్నానం చేయడం మానేసి, రోజుల తరబడి పేరుకుపోయిన చెమట వాసనే తమకు గొప్ప ఆకర్షణను తెచ్చిపెడుతుందని గుడ్డిగా నమ్ముతున్నారు. ఈ పిచ్చి ఎంతవరకు వెళ్లిందంటే... కొందరు టీనేజర్లు అసలు మొహం కడుక్కోవడానికి కూడా ఇష్టపడటం లేదు.రోజులు తరబడి అవే చెమట పట్టిన బట్టలు వేసుకుని తిరుగుతున్నారు.

మూత్రం తాగే వెర్రి వెంగళప్పలు...

శరీరంలోని మాలిన్యాలన్నీ చెమట రూపంలో బయటకు పోవాలనే వెర్రి ఆలోచనతో కొందరైతే ఏకంగా తమ మూత్రాన్ని తామే తాగుతున్నట్లు ప్రముఖ వెబ్‌సైట్లు బట్టబయలు చేశాయి. చూడటానికి వినడానికి అసహ్యంగా ఉన్నా ఇదొక గొప్ప ఫ్యాషన్ అని వీరు సోషల్ మీడియాలో డబ్బాలు కొట్టుకుంటున్నారు. అసలు ఈ వికృత చేష్టల వెనుక ఉన్న శాస్త్రీయ మూలాలు ఏమిటో వెతికితే దిమ్మతిరిగిపోతుంది. జంతువులు, పురుగులు తమ సహజ పద్ధతుల ద్వారా ఒకదానికొకటి సంకేతాలు పంపు కుంటాయి. వీటినే ఫెరోమోన్స్ అంటారు. ప్రకృతిలో ఇవి కొన్ని జీవులకు వర్తించవచ్చు కానీ మనుషులలో కూడా ఇవే పద్ధతిలో శృంగార ఆకర్షణ పనిచేస్తుందా లేదా అనేదానిపై ఇప్పటికీ ఎలాంటి ఖచ్చితమైన ఆధారాలు లేవు.

పాత ప్రయోగాల భ్రమలు...

ఈ వాదన వెనుక కొందరు 1995 నాటి ఒక పాత స్వెటీ టీ షర్ట్ ప్రయోగాన్ని ఉదాహరణగా చూపుతుంటారు. పురుషులు రెండు రోజులు వేసుకున్న చెమట కొట్టే షర్టుల వాసనను మహిళలు పీల్చారని, ఆ మురికి వాసన వారికి నచ్చిందని ఆ రోజుల్లో చెప్పారు. కానీ ఆ ప్రయోగం కేవలం కొద్దిమందిపై మాత్రమే జరిగిందితప్పా మనుషులందరికీ అదే సూత్రం వర్తిస్తుందని ఏ శాస్త్రవేత్త కూడా ఎప్పుడూ అనలేదు. 2020లో జరిగిన మరో విశ్లేషణలో అయితే శరీర వాసన ఆధారంగా మనుషులు లవర్సును ఎంచుకుంటారనే నిజాన్ని ఏ పరిశోధన కూడా నిరూపించలేకపోయింది.

మురికి సంస్కృతికి విపరీతమైన ప్రచారం...

ఎలాంటి ఆధారాలు లేకపోయినా సోషల్ మీడియాలో మాత్రం ఈ మురికి సంస్కృతికి విపరీతమైన ప్రచారం దక్కుతోంది. వ్యూస్ కోసం, లైకుల కోసం ఇన్‌ఫ్లుయెన్సర్లు చెబుతున్న ఈ మూర్ఖపు సలహాలను కుర్రకారు గుడ్డిగా ఫాలో అయిపోతున్నారు. శుభ్రతను పూర్తిగా గాలికి వదిలేసి, సమాజంలో నలుగురిలో తిరగడానికి కూడా సిగ్గుపడని స్థాయికి దిగజారిపోతున్నారు. స్నానం చేయడం, సబ్బు రాసుకోవడం, పళ్లు తోముకోవడం చేతకాని వాళ్ళు ఇలాంటి చెత్త కబుర్లు చెబుతారంటూ ఎక్స్ వేదికగా నెటిజెన్లు దుమ్మెత్తిపోశారు.

వాంతి తెప్పించే కంపు

పక్కవాడు భరించలేని కంపుతో తిరిగితే ప్రేమ పుట్టడం దేవుడెరుగు వాంతి చేసుకోవడం ఖాయమని చాలా మంది ఘాటుగా విమర్శించారు. నిజానికి ఈ కాలపు యువత సోషల్ మీడియా మాయలో పడి తమ విచక్షణా జ్ఞానాన్ని పూర్తిగా కోల్పోతున్నారు. ఇతరుల దృష్టిలో తాము విభిన్నంగా కనిపించాలనే ఆరాటంలో ఇలాంటి అసహ్యకరమైన పద్ధతులను ఎంచుకుంటున్నారు. ఇది కేవలం వారి వ్యక్తిగత ఆరోగ్యాన్నే కాకుండా వారి చుట్టూ ఉన్నవారికి కూడా చికాకు కలిగిస్తోంది.